సాక్షి రంగారెడ్డి

బుధవారం । 11 । జూన్ । 2025



శాంతిభద్రతల రక్షణకు..

శాంతి భద్రతల పరిరక్షణకు అన్ని చర్యలు తీసుకుంటామని ఏసీపీ లక్ష్మీనారాయణ స్పష్టం చేశారు. 8లో▸



పది టిప్పర్లు, జేసీబీ సీజ్

ప్రభుత్వ భూముల్లో అక్రమంగా మట్టి తవ్వకాలు చేపడితే కేసులు నమోదు చేయిస్తామని తహసీల్దార్ హెచ్చరించారు. 8లో▸



ప్రభుత్వ భూముల పరిశీలన

కొందుర్గు మండల కేంద్రంలో అధిక విస్తీర్ణంలో ఉన్న ప్రభుత్వ స్థలాలను మంగళవారం అధికారులు పరిశీలించారు. 8లో▸

సమస్యల ఏలు'బడి'!

రేపటి నుంచి తెరుచుకోనున్న విద్యా సంస్థలు



ఇది షాబాద్ మండలం తాళ్లపల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాల. ఇక్కడ 120మంది విద్యార్థులు విద్యాభ్యాసం సాగిస్తున్నారు. భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరింది. మన ఊరు–మనబడి పథకం కింద ఎంపిక కావడంతో కాంట్రాక్టర్ మరమ్మతు పనులు మొదలుపెట్టారు. బిల్లులు రాకపోవడంతో మధ్యలోనే వదిలేశారు. చుట్టూ పిచ్చిమొక్కలు పెరిగిపోయాయి. వంటగది లేక వరండాలోనే వండాల్సి వస్తోంది. వర్షం వస్తే ఏ క్షణంలో ఏమవుతుందోనని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

- 30 శాతం కూడా పూర్తి కాని అభివృద్ధి, మరమ్మతు పనులు
- చేసిన వాటికి బిల్లులు రాక నిలిపివేత
- ఎప్పటిలాగే ఈ ఏడాదీ తప్పని తిప్పలు
- అపరిశుభ్రంగా పాఠశాల ప్రాంగణాలు
- స్కావేంజర్లు లేక.. ఊడ్చేవాళ్లు రాక ఇబ్బంది

సాక్షి, రంగారెడ్డిజిల్లా: బడి గంటలు గురువారం నుంచి మోగనున్నాయి. పాఠశాలలు పునఃప్రారంభం కాబోతున్నాయి. ఎప్పటిలాగే ఈ విద్యా సంవత్సరం కూడా విద్యార్థులకు సమస్యలే స్వాగతం పలకనున్నాయి. గత ప్రభుత్వ హయాంలో 'మన ఊరు–మనబడి' పథకం కింద చేపట్టిన అదనపు తరగతి గదుల నిర్మాణం, మరుగుదొడ్లు, డైనింగ్‌హాల్స్ నిర్మాణ పనులు ఇప్పటికీ పూర్తి కాలేదు. పనులు చేసిన కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకపోవడంతో వారు మధ్యలోనే నిలిపివేశారు. పైసా ఖర్చులేకుండా ప్రభుత్వ పాఠశాలల్లో నిపుణులైన ఉపాధ్యాయులతో మంచి విద్యాబోధన పొందొచ్చని భావించిన నిరుపేద విద్యార్థులకు మళ్లీ నిరాశే మిగుల్చుతోంది. ఇంగ్లిష్ మీడియంలో బోధన, ఉచిత పుస్తకాలు, యూనిఫాం, పౌష్టికాహారం అందిస్తున్నప్పటికీ మౌలిక సదుపాయాల లేమి వేధిస్తోంది. వెరసి ఆశించిన స్థాయిలో కొత్త అడ్మిషన్లు రాకపోగా, ఉన్నవి కూడా కోల్పోవాల్సి వస్తోంది. వేసవి సెలవుల కారణంగా తరగతి గదుల నిండా దుమ్ము ధూళి పేరుకుపోయాయి. మరుగుదొడ్లు, మూత్రశాలలను శుభ్రం చేసేందుకు స్కావేంజర్లు లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు.

నిధులు లేక నిలిచిన పనులు

❖ కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ స్కూళ్లను తీర్చిదిద్దాలని అప్పటి ప్రభుత్వం భావించింది. ఈ మేరకు 'మన ఊరు– మన బడి'పథకాన్ని తీసుకొచ్చింది. పైలెట్ ప్రాజెక్ట్ కింద జిల్లెలగూడ ప్రాథమిక, ఉన్నత పాఠశాలతోపాటు శివరాంపల్లి ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను ఎంపిక చేసింది. రూ.2 కోట్లతో వీటిని తీర్చిదిద్దింది. తర్వాత మొదటి విడతలో 464 ప్రభుత్వ పాఠశాలలను ఎంపిక చేసింది. వీటిలో 448 పాఠశాలలకు రూ.99.45 కోట్ల అంచనా వ్యయంతో పనులు చేపట్టింది. రూ.30 లక్షలకు లోబడి ఉన్న 345 పాఠశాలల్లో ఇంజినీరింగ్ విభాగం ద్వారా పనులు చేపట్టింది. రూ.30 లక్షలకుపైగా అంచనా వ్యయంతో చేపట్టే పనులను టెండర్ ద్వారా చేపట్టారు. అదనపు తరగతి గదులు, ప్రహరీలు, భవనాలకు రంగులతో పాటు ఫర్నిచర్, విద్యుత్, తాగునీరు, డైనింగ్ హాల్, కిచెన్‌షెడ్లు వంటి మౌలిక సదుపాయాలను కల్పించాలని నిర్ణయించారు. ఆ మేరకు 30 శాతం పనులు మాత్రమే పూర్తి చేశారు 70 శాతం పనులు పెండింగ్‌లో ఉన్నాయి. అసంపూర్తి నిర్మాణాలు, అరకొర తరగతి గదుల మధ్య ఎలా చదువుకోవాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు.



ఇబ్రహీంపట్నం: బాలికల ఉన్నత పాఠశాలలో అసంపూర్తిగా వంట గదులు





కడ్తాల్: రావిచేడ్ ఉన్నత పాఠశాలలో నిలిచిన మరుగుదొడ్ల నిర్మాణం

తడిసి మోపెడైన అప్పులు

❖ యాచారం మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన చంద్రారెడ్డి అదే గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో రూ.25 లక్షలు ఖర్చు చేసి తరగతి గదులకు మరమ్మతులు చేయించాడు. పనులు పూర్తయి 18 నెలలైంది. అధికారులు ఎంబీ (మెజర్మెంట్ బుక్) కూడా రికార్డు చేశారు. ఆయనకు ఇప్పటి వరకు డబ్బులు రాలేదు.

❖ ఇబ్రహీంపట్నం మండలానికి చెందిన శ్రీనివాసరెడ్డి రూ.30 లక్షలు ఖర్చు చేసి శేరిగూడ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో తరగతి గదుల మరమ్మతులు, మరుగుదొడ్ల నిర్మాణం పనులు చేపట్టారు. చేసిన అప్పులు రెట్టింపయ్యాయి కానీ పనులుకు మాత్రం బిల్లు రాలేదు.

❖ నాదర్‌గుల్‌కు చెందిన శివకుమార్ రూ.32 లక్షలు ఖర్చు చేసి ఆదిబట్ల జెడ్పీ స్కూల్ చుట్టూ ప్రహరీ నిర్మాణం, తరగతి గదుల మరమ్మతులు, మరుగుదొడ్ల నిర్మాణం తదితర అభివృద్ధి పనులు చేపట్టారు. బిల్లులు మాత్రం రాలేదు. ఈ పథకం కింద పనులు చేపట్టిన అనేక మంది ఇదే పరిస్థితి ఎదుర్కొంటున్నారు.

అభివృద్ధి పనుల అంచనా ఇలా..

అంశం	కేటాయించిన బడ్జెట్
అదనపు తరగతి గదుల నిర్మాణం	రూ.29,91,50,058
తాగునీటి సరఫరా పనులు	రూ.5,97,34,702
ప్రహరీల నిర్మాణం	రూ.4,88,70,392
విద్యుద్దీకరణ పనులు	రూ.8,17,26,500
డైనింగ్ హాల్స్	రూ.20,11,31,113
టాయ్‌లెట్స్ విత్ రన్నింగ్ వాటర్	రూ.6,64,40,861
వంటగదుల నిర్మాణం	రూ.2,39,50,261
మేజర్ అండ్ మైనర్ వర్క్స్	రూ.24,35,55,927

నిధులు లేక..



మన ఊరు–మన బడి పథకం కింద సివిల్‌వర్క్స్, వాటర్, శానిటేషన్, మైనర్ అండ్ మేజర్ రిపేరు, విద్యుద్దీకరణ పనులు చేపట్టారు. 80 శాతం పనులు పూర్తయినా 10 శాతం నిధులు మాత్రమే మంజూరయ్యాయి. నిధులు లేకపోవడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. ప్రభుత్వం నిధులు మంజూరు చేసి మిగతా పనులు పూర్తి చేయాలి.

– జంగయ్య, హెచ్‌ఎం, కడ్తాల్ బాలుర ఉన్నత పాఠశాల

న్యూస్‌రీల్

పీసీసీ అధ్యక్షుడికి కృతజ్ఞతలు



కందుకూరు: పీసీసీ ప్రధాన కార్యదర్శిగా నియమితుడైన మండల పరిధిలోని దెబ్బడగూడకు చెందిన ఏనుగు జంగారెడ్డి మంగళవారం పీసీసీ అధ్యక్షుడు బి.మహేశ్‌కుమార్‌గౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛంఅందించి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి తన శాయశక్తులా కృషి చేస్తానని అన్నారు. ఆయన వెంట డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి ఉన్నారు.

హైటెన్షన్ లైన్ రూట్ మార్చాలని వినతి



కేశంపేట: ఇళ్లకు సమీపం నుంచి 765 కేవీ హైటెన్షన్ వైర్లు వెళ్తున్నాయని, వాటిని రూట్ మార్చాలంటూ కేంద్ర విద్యుత్‌శాఖ సహాయ మంత్రి శ్రీపాద్‌యశో నాయక్‌కు పోమాల్‌పల్లి గ్రామస్తులు విన్నవించారు. ఈ మేరకు గోవాలోని మంత్రి నివాసంలో మంగళవారం కలిసి వినతిపత్రం సమర్పించారు. స్పందించిన ఆయన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు గ్రామస్తులు తెలిపారు. కేంద్ర సహాయమంత్రిని కలిసిన వారిలో బీజేపీ మాజీ మండల అధ్యక్షుడు నర్సింహయాదవ్, కుమ్మరి మహేశ్, భూపాల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

13న ఇంటర్ ప్రవేశాలకు స్పాట్ కౌన్సెలింగ్

మహేశ్వరం: స్థానిక గిరిజన బాలుర సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరం సీఈసీ, హెచ్‌ఈసీ గ్రూపుల్లో ఖాళీలు ఉన్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ నళిని మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మిగిలిన సీట్లకు ఈనెల 13న స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు సర్టిఫికెట్లతో హాజరు కావాలని సూచించారు.

సున్నిత ప్రాంతాల్లో రాచకొండ సీపీ తనిఖీలు



షాహిన్‌నగర్‌లో వాహనాల తనిఖీని పర్యవేక్షిస్తున్న రాచకొండ సీపీ సుధీర్ బాబు

పహాడీషరీఫ్: సున్నితమైన బాలాపూర్, పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో రాచకొండ పోలీస్ కమిషనర్ జి.సుధీర్ బాబు మంగళవారం ఆకస్మికంగా తనిఖీలు చేశారు. రెండు ఠాణాల పరిధిలో విజిబుల్ పోలీసింగ్‌తో పాటు స్థానిక పోలీసులు వాహనాల తనిఖీ ఏ తరహా చేపడుతున్నారనే విషయమై మహేశ్వరం జోన్ డీసీపీ డి.సునీతా రెడ్డితో కలిసి పర్యవేక్షించారు. విజిబుల్ పోలీసింగ్ ద్వారా ప్రజలకు భద్రత విషయంలో భరోసా కల్పించాలని బాలాపూర్, పహాడీషరీఫ్ ఇన్‌స్పెక్టర్లు ఎం.సుధాకర్, పి.గురువారెడ్డికి సూచించారు. నగర శివారు ప్రాంతం కావడంతో ఎప్పటికప్పుడు వాహనాల తనిఖీ చేపట్టాలన్నారు. తనిఖీల సమయంలో పరిశీలించాల్సిన అంశాలపై సూచనలు చేశారు. తనిఖీల్లో మహేశ్వరం అదనపు డీసీపీ సత్యనారాయణ, ఏసీపీ జానకీ రెడ్డి పాల్గొన్నారు.

స్కూళ్లు ప్రారంభమయ్యేలోగా యూనిఫాంల పంపిణీ



ఉపాధ్యాయులకు యూనిఫాంలు అందిస్తున్న ఏపీడీ సూర్యారావు

కడ్తాల్: పాఠశాలలు ప్రారంభమయ్యేలోగా విద్యార్థులకు పూర్తి స్థాయిలో యూనిఫాం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు డీఆర్‌డీఏ ఏపీడీ సూర్యారావు అన్నారు. మండల కేంద్రంలోని మహిళా సమాఖ్య భవనంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో మండల పరిధిలోని పది పాఠశాలలకు సంబంధించి స్కూల్ యూనిఫాం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డీఆర్‌డీఏ ద్వారా మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో మహిళా సంఘాల సభ్యులచే యూనిఫాంలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. ఈనెల 12న పాఠశాలలు ప్రారంభించేలోగా, ఆయా పాఠశాలలకు మొదటి జత అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో డీపీఎం బాలరాజు, ఎంఈఓ సత్యనారాయణ, ఏపీఎం రాజేశ్వరి, సీసీలు జరీనా, వసంత, నర్సింహ ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న లోక్ అదాలత్

చేవెళ్ల: ట్రాఫిక్ కేసులకు సంబంధించి చేవెళ్ల కోర్టు ఆవరణలో జరుగుతున్న లోక్ అదాలత్‌లో మంగళవారం రెండోరోజు కొనసాగింది. రిటైర్డు జడ్జి కె.లక్ష్మణ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మొత్తం 169 కేసులు పరిష్కరించారు. రూ.3.78 లక్షల జరిమానా విధించారు. ఇందులో డ్రంకెన్ డ్రైవ్ కేసులు 93 కాగా, ఇతర కేసులు 76 ఉన్నాయి. ఈనెల 14వ తేదీ వరకు లోక్ అదాలత్ కొనసాగుతుందని ట్రాఫిక్ సీఐ వెంకటేశం తెలిపారు. చేవెళ్ల, శంకర్‌పల్లి, షాబాద్ మండలాల పరిధిలో కేసులు నమోదైన వారు పరిష్కరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ చందర్ నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.



వైద్యశిబిరంలో మాట్లాడుతున్న శ్రీదేవి

అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

- మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్ అండ్ డైరెక్టర్ శ్రీదేవి

చేవెళ్ల: మున్సిపాలిటీ అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్ అండ్ డైరెక్టర్ టీకే శ్రీదేవి అన్నారు. వంద రోజుల ప్రణాళికలో భాగంగా మంగళవారం మున్సిపాలిటీలోని మెప్మా సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులకోసం ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ వైద్య శిబిరాన్ని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్యతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కొత్త మున్సిపాలిటీని అంతా కలిసి ఆదర్శంగా మార్చుకోవాలని సూచించారు. వంద రోజుల ప్రణాళికలో భాగంగా ఒక్కోరోజు ఒక్కో కార్యక్రమంతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఎమ్మెల్యే కాలె యాదయ్య మాట్లాడుతూ.. మున్సిపాలిటీ అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తానని తెలిపారు. అనంతరం మున్సిపాలిటీ ఆవరణలో మొక్కలు నాటారు. మెప్మా సభ్యులకు రూ.3.20 కోట్ల బ్యాంకు లింకేజీ చెక్కును అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ ప్రత్యేకాధికారి శ్రీధర్, రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యుడు చింపుల సత్యనారాయణరెడ్డి, టీపీసీసీ నాయకుడు జనార్దన్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ పూర్ణచందర్, పీఏసీఎస్ చైర్మన్ డి.వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రణాళికను సమర్థవంతంగా నిర్వహించాలి

మొయినాబాద్: మున్సిపాలిటీల్లో చేపడుతున్న వంద రోజుల ప్రణాళికను సమర్థవంతంగా నిర్వహించాలని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్ అండ్ డైరెక్టర్ టీకే శ్రీదేవి అన్నారు. మున్సిపల్ పరిధిలోని చిలుకూరులో నిర్మించిన పొడి చెత్త వేరు చేసే డీఆర్‌సీసీ కేంద్రాన్ని మంగళవారం ఆమె ప్రారంభించారు. అనంతరం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వర్షాకాలంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు, రోగాలు రాకుండా వంద రోజుల ప్రణాళికలో చర్యలు తీసుకోవాలన్నారు. పరిసరాల పరిశుభ్రత, తడిచెత్త, పొడి చెత్త వేరు చేయడం, సురక్షిత మంచినీటిపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో జేడీ ఫల్గున్, డీడీ శ్రీధర్, మున్సిపల్ కమిషనర్ ఖాజా మొయిజుద్దీన్, మేనేజర్ జమీర్ హైమద్ తదితరులు పాల్గొన్నారు.

దుక్కులు సిద్ధం | వరుణుడే ఆలస్యం



నక్కర్తమేడిపల్లిలో సాగుకు సిద్ధంగా ఉన్న పొలం

అదును దాటుతోంది. వర్షాల జాడ కానరావడం లేదు. దీంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. పక్షం రోజుల క్రితం పలకరించిన తొలకరితో.. రైతులు వ్యవసాయ పొలాలను సిద్ధం చేసుకున్నారు. వర్షాలు కురిసిన వెంటనే విత్తనాలు విత్తుకోవడానికి రూ.లక్షలు వెచ్చించి ఎరువులు, విత్తనాలు కొనుగోళ్లు చేశారు. వరుణుడు ముఖం చాటేయడంతో కలవరానికి గురవుతున్నారు. ఆకాశం వైపు దీనంగా చూస్తున్నారు.

- కానరాని వానజాడ.. కర్షకుల ఆందోళన
- సాగుకు పొలాలు సిద్ధం
- విత్తనాలు, ఎరువుల కొనుగోళ్లు పూర్తి
- మెట్ట పంటలు కష్టమేనంటున్న రైతులు
- జిల్లాలో 3,58,089 ఎకరాల్లో సాగు అంచనా

యాచారం: ఈ ఏడు ముందస్తు రుతుపవనాలు వస్తాయన్న వాతావరణ శాఖ ప్రకటనతో తొలుత రైతులు ఆనందం వ్యక్తంచేశారు. సాగుకు కావాల్సిన సరంజామా సిద్ధంగా ఉంచుకున్నారు. అయినప్పటికీ.. ఆకాశంలో మబ్బులే తప్ప.. వాన జాడ లేదు. దీంతో ఈ ఏడాది అదునులో పంటలు సాగవుతాయా, లేదా అని భయాందోళన చెందుతున్నారు. వర్షాలు పడకపోవడంతో పాటు ఎండ తీవ్రత అధికంగా ఉండటంతో ఇక మెట్ట పంటల సాగు కష్టమేనని భావిస్తున్నారు. రోహిణిలో వర్షాలు పడకపోగా.. మృగశిర కార్తె ప్రారంభమై నాలుగు రోజులు గడుస్తున్నా వరుణుడు కరుణించకపోవడంతో దిక్కులు చూస్తున్నారు.

మెట్ట పంటలకు పది రోజులే గడువు

సమృద్ధిగా వర్షాలు కురిస్తే మెట్ట పంటలు పత్తి, కంది, ఆముదం, జొన్న, సజ్జ తదితర పంటల సాగుకు వారం, పది రోజులే అనువైన గడువని వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు. జూన్ 15 లోపు వరకు, ఆ తర్వాత మరో వారం విత్తనాలు విత్తుకోవడానికి అవకాశం ఉంటుందని స్పష్టం చేస్తున్నారు. రోహిణి కార్తెలో కురిసిన వర్షాలకు జిల్లాలోని ఇబ్రహీంపట్నం, యాచారం, మంచాల, మాడ్గుల, ఆమనగల్లు, తలకొండపల్లి, కడ్తాల్, షాద్‌నగర్, మహేశ్వరం, కందుకూరు, కొత్తూర్ తదితర మండలాల్లో కొంత మంది రైతులు పత్తి, జొన్నను సాగు చేశారు. ఆ తర్వాత వాన పడకపోవడంతో విత్తిన విత్తనాలు మొలకెత్తే పరిస్థితి లేక.. పెట్టుబడులు కోల్పోయామంటూ ఆందోళన చెందుతున్నారు.

అవగాహన సదస్సులు

ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ విశ్వ విద్యాలయం, వ్యవసాయ శాఖల ఆధ్వర్యంలో 'రైతు ముగింట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమంతో అధికారులు, శాస్త్రవేత్తలు 20 రోజులుగా గ్రామాల్లో విస్తృతంగా సదస్సులు నిర్వహిస్తున్నారు. సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. తొలకరితో జిల్లాలో 25 వేల ఎకరాలకుపై గా పత్తి, జొన్న, కంది తదితర మెట్ట పంటలను రైతులు సాగు చేసినట్లు అధికారులు గుర్తించారు. వరి విషయానికి వస్తే రోహిణి కార్తెలో నారు పోస్తే ఆశించిన దిగుబడి వస్తుందని రైతుల్లో ఆశ. కానీ వరుణుడు నిరాశపర్చడం, ఎండలు మండుతుండటంతో చెరువులు, కుంటలు ఎండిపోయాయి. బోరుబావులు అడుగంటాయి. ఈ కష్టాలన్నీ గట్టెక్కాలంటే భారీ వర్షాలు కురవాల్సిందేనని వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు. నార్లు పోసుకోవడానికి సిద్ధంగా ఉన్న రైతులు.. కొద్ది పొలంలోనే పోసుకుని, సంరక్షించుకోవాలని సూచిస్తున్నారు.

జిల్లాలో వానాకాలం సాగు అంచనా వివరాలు

పంట పేరు	అంచనా సాగు(ఎకరాల్లో)
వరి	1,40,238
జొన్న	5,562
సజ్జ	21
మొక్కజొన్న	52,207
రాగులు	30
కందులు	14,308
మినుములు	4
పెసర్లు	13
ఉలవలు	42
ఆముదాలు	37
వేరు శనగ	96
పొద్దు తిరుగుడు	1
నువ్వులు	10
సోయాబీన్	50
పత్తి	1,41,088
ఇతర పంటలు	4,382

వర్షం పడితేనే విత్తనాలు

తగిన వర్షాలు పడితేనే విత్తనాలు విత్తుకోవాలని, తడిపొడి భూమిలో విత్తితే మొలకెత్తకపోవడంతో పాటు.. పెట్టుబడి కోల్పోవాల్సి వస్తుందని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. ఇదిలా ఉండగా.. జిల్లాలో ఈ ఏడాది వానాకాలం సీజన్‌లో 3,58,089 ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగవుతాయని అధికారులు అంచనా వేశారు. అత్యధికంగా పత్తి 1,41,088 ఎకరాల్లో, వరి 1,40,238, మొక్కజొన్న 52,207 ఎకరాల్లో సాగవుతుందని పేర్కొంటున్నారు. సాగుకు కావాల్సిన విత్తనాలు, ఎరువులను వ్యవసాయ శాఖ సిద్ధం చేసి ఉంచిందని తెలిపారు.



రైతు ఏర్పాటు చేసుకున్న విత్తన సంచులు

పత్తి మొలకెత్తలేదు



తొలకరి జల్లులకు 15 ఎకరాల్లో పత్తి, 5 ఎకరాల్లో వరి, మరో 3 ఎకరాల్లో కూరగాయల సాగుకు పొలం సిద్ధం చేసి ఉంచాను. పత్తి విత్తాను. కానీ వాన పడకపోవడంతో మొలకెత్తడం లేదు. నాలుగు బోరుబావుల్లో భూగర్భ జలాలు అడుగంటాయి. సమృద్ధి వర్షాలు పడితే కాని.. ముందుకు వెళ్లని దుస్థితి. రూ.లక్షల్లో పెట్టుబడి పెట్టాను.

– వీరప్ప, రైతు, నక్కర్తమేడిపల్లి

40 వేల ఎకరాల్లో మెట్ట పంటలు



సమృద్ధిగా వర్షాలు కురిస్తేనే పత్తి విత్తనాలు విత్తుకోవాలి. మృగశిర ప్రారంభంతో వర్షాలు కురిసే అవకాశం ఉందని వ్యవసాయ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. జూన్ 15వ తేదీ లోపు మెట్ట పంటలకు అనువైన సమయం. తర్వాత నాలుగైదు రోజులు కూడా విత్తనాలు విత్తుకోవచ్చు. వాన పడితేనే వరి నార్లు పోసుకోవాలి.

– బి.నర్సింహారావు, జిల్లా వ్యవసాయాధికారి

తోరణాలు కట్టి స్వాగతం పలకాలి



జూమ్ మీటింగ్ ద్వారా మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

- పాఠశాలల ప్రారంభోత్సవం పండుగలా నిర్వహించాలి
- కలెక్టర్ నారాయణరెడ్డి

సాక్షి, రంగారెడ్డిజిల్లా: పాఠశాలల పునఃప్రారంభోత్సవం ఓ పండుగ వాతావరణంలో నిర్వహించాలని కలెక్టర్ నారాయణరెడ్డి సూచించారు. ఈ మేరకు మంగళవారం బడిబాట, వనమహోత్సవం, ఇందిరా మహిళాశక్తి అంశాలపై సంబంధిత అధికారులతో జూమ్ మీటింగ్ నిర్వహించారు. తొలి రోజు వేడుకల్లో భాగంగా పాఠశాలలకు తోరణాలు కట్టి విద్యార్థులు, వారి తల్లిదండ్రుల కు స్వాగతం పలకాలని అన్నారు. బడి బయట ఉన్న పిల్లలను బడిలో చేర్పించి, వారికి అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచాలని, ఈ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించే అధ్యాపకులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. పాఠశాల ప్రాంగణం సహా కిచెన్, స్టోర్ రూమ్స్, తరగతి గదులన్నీ శుభ్రం చేయించాలన్నారు. పాఠశాల పునఃప్రారంభం రోజే పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్, ఒక జత యూనిఫాం అందజేయాలన్నారు. విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉన్న 160 పాఠశాలల్లో ప్రత్యేక శ్రద్ధ వహించి పని చేయాలని, స్థానిక ప్రజా ప్రతినిధుల సహకారంతో పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచాలని విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. వన మహోత్సవంలో భాగంగా పండ్ల మొక్కలు నాటించాలని, ఇందిరా మహిళా శక్తి పథకంలో భాగంగా 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళను సెల్ఫ్ హెల్ప్ గ్రూప్‌లో చేర్పించాలని సూచించారు. సమావేశంలో డీఈఓ సుశీందర్‌రావు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

శాంతిభద్రతల రక్షణకు చర్యలు

ఏసీపీ లక్ష్మీనారాయణ

షాద్‌నగర్‌రూరల్: శాంతి భద్రతల పరిరక్షణకు చర్యలు తీసుకుంటామని ఏసీపీ లక్ష్మీనారాయణ అన్నారు. పట్టణంతో పాటు ఫరూఖ్‌నగర్‌లో మంగళవారం రాత్రి వాహనాల తనిఖీ చేట్టారు. కిరాణా దుకాణాలు, బెల్టుషాపులు, దాబాలు, లాడ్జీలపై దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. నిషేధిత గుట్కాలు, అనుమతులు లేకుండా మద్యం విక్రయాలు, బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. రాత్రి సమయాల్లో అపరిచితులకు దూరంగా ఉండాలని, అలాంటి వారు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. తనిఖీల్లో పట్టణ సీఐ విజయ్‌కుమార్, డీఐ వెంకటేశ్వర్లు, రూరల్ సీఐ నర్సయ్య, కేశంపేట సీఐ నరహరి, ట్రాఫిక్ సీఐ చంద్రశేఖర్, ఎస్‌ఐలు, ఎస్‌ఓటీ పోలీసులు, పాల్గొన్నారు.



వాహనాల తనిఖీ చేపడుతున్న ఏసీపీ లక్ష్మీనారాయణ తదితరులు

ప్రభుత్వ భూముల పరిశీలన



కొందుర్గులో ప్రభుత్వ స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

కొందుర్గు: మండల కేంద్రంలో అధిక విస్తీర్ణంలో ఉన్న ప్రభుత్వ స్థలాలను మంగళవారం అధికారులు పరిశీలించారు. కొందుర్గు పడమర శివారు సర్వే నంబర్ 150, 161లలో గల ప్రభుత్వ భూమిని జీహెచ్‌ఎంసీ విభాగం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రామునాయక్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో అత్యధిక విస్తీర్ణం గల ప్రాంతాలను గుర్తించి స్థలాలను పరిశీలిస్తున్నామని ఆయన వివరించారు. ఈ సర్వే నంబర్లలో మొత్తం ప్రభుత్వ భూమి 230 ఎకరాలు ఉందని, ఇందులో పేదలకు అసైన్డ్ చేయడంతో పాటు మైనింగ్ కోసం లీజుకు ఇచ్చింది పోను ఇంకా 150 ఎకరాల వరకు అందుబాటులో ఉందని తహసీల్దార్ రమేశ్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో ఎంఆర్ఐ శివకుమార్, జీహెచ్‌ఎంసీ అధికారులు పాల్గొన్నారు.

పది టిప్పర్లు, జేసీబీ సీజ్

- యజమానులు, డ్రైవర్లపై కేసులు నమోదు
- మరోసారి పట్టుబడితే నాన్ బెయిలబుల్ కేసులు
- షాబాద్ తహసీల్దార్ ఎండీ అన్వర్

షాబాద్: ప్రభుత్వ భూముల్లో అక్రమంగా మట్టి తవ్వకాలు చేపడితే క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తామని షాబాద్ తహసీల్దార్ ఎండీ అన్వర్ హెచ్చరించారు. మంగళవారం తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. సులభంగా డబ్బు సంపాదించేందుకు అలవాటు పడిన కొందరు ప్రభుత్వ భూముల్లోని మట్టిని అక్రమంగా తవ్వి, ప్రైవేట్ కంపెనీలకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారని తెలిపారు. సోలీపేట్ గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 350లో ఉన్న 120 ఎకరాల ప్రభుత్వ భూమిలో అక్రమంగా మట్టిని తరలిస్తున్నారని సమాచారం రావడంతో సోమవారం రాత్రి దాడులు నిర్వహించామన్నారు. పది టిప్పర్లు, ఒక జేసీబీని అదుపులోకి తీసుకున్నామని స్పష్టంచేశారు. వీటికి సంబంధించిన యజమానులు, డ్రైవర్లపై కేసులు నమోదు చేశామన్నారు. మరోమారు ఇలాంటి అక్రమాలకు పాల్పడితే నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేస్తామని, ఈసీ వాగు నుంచి ఇసుక తరలిస్తున్న వారిపైనా చర్యలు తప్పవని హెచ్చరించారు.



వివరాలు వెల్లడిస్తున్న తహసీల్దార్ అన్వర్

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి బలవన్మరణం

శంకర్‌పల్లి: ఆన్‌లైన్ బెట్టింగులకు అలవాటు పడి, చేసిన అప్పులు తీర్చలేక ఓ వ్యక్తి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ సంఘటన మంగళవారం శంకర్‌పల్లి పట్టణంలో చోటుచేసుకుంది. సీఐ శ్రీనివాస్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. కూకట్‌పల్లికి చెందిన బండి రామ మైసూర్‌రెడ్డి(44), చిన్న వ్యాపారం చేస్తూ.. జీవనోపాధి పొందేవాడు. ఈ క్రమంలో వ్యాపారం సాగక.. ఆన్‌లైన్ బెట్టింగులకు అలవాటు పడ్డాడు. అక్కడా నష్టం రావడంతో అప్పులు చేశాడు. అవి తీర్చేమార్గం కానరాక సతమతమయ్యాడు. దీంతో సోమవారం ఇంట్లో ఎవరికి చెప్పకుండా వెళ్లిపోయాడు. ఎంతకీ రాకపోవడంతో.. కుటుంబ సభ్యులు మంగళవారం కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టిన పోలీసులు, సదరు వ్యక్తి లోకేషన్ చూడగా.. శంకర్‌పల్లిలోని ఓ లాడ్జి చూపించింది. అక్కడికి వెళ్లి లాడ్జిలోని గదులను పరిశీలించగా.. ఓ గదిలో ఉరివేసుకొని విగతజీవిగా కనిపించాడు. కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ శ్రీనివాస్ గౌడ్ తెలిపారు.

అనుమానంతో భార్యను అంతం చేశాడు

చైతన్యపురి: వివాహేతర సంబంధం పెట్టుకుందన్న అనుమానంతో తన భార్యను మెడకు చున్నీ బిగించి హతమార్చాడు ఓ వ్యక్తి. సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ ఘటన గురించి ఇన్‌స్పెక్టర్ సైదిరెడ్డి వివరాలు వెల్లడించారు. భాగ్యనగర్ కాలనీలో అమ్ములు (30), మరియదాస్‌లు నివాసముంటున్నారు. వీరికి ఇద్దరు పిల్లలు. మరియదాస్ కారు డ్రైవర్‌గా పనిచేస్తుండగా అమ్ములు ఇండ్లలో పనిచేస్తోంది. భార్యభర్తలిద్దరికీ ఒకరిపై ఒకరికి వివాహేతర సంబంధ అనుమానాలు ఉన్నాయి. కొంత కాలంగా ఇదే విషయమై ఇద్దరి మధ్యా గొడవ జరుగుతోంది.. సోమవారం రాత్రి పదిగంటల సమయంలో గొడవ పెట్టుకున్నారు. మంగళవారం మధ్యాహ్నం మరియదాస్.. అమ్ములు మెడకు చున్నీ బిగించి హతమార్చాడు. ఇదే విషయాన్ని మరియదాస్ ఎదురు ఇంట్లో ఉండే మామ అర్జునుడుకి సమాచారం ఇచ్చాడు. దీంతో అర్జునుడు వారి ఇంటికి వెళ్లి చూడగా కూతురు విగతజీవిగా ఉండటం గమనించాడు. సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించి నిందితుడిని అరెస్ట్ చేసినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

నగరంలో నారీ భేరి!



- కమిషనరేట్‌లో భారీగా పెరిగిన మహిళా అధికారులు
- ఒకప్పుడు కేవలం ఒక్కరికి మాత్రమే అవకాశం
- డీసీపీ ఆపై స్థాయి పోస్టుల్లో ప్రస్తుతం పది మంది
- తాజాగా స్పెషల్ బ్రాంచ్ చీఫ్‌గా వచ్చిన అపూర్వ



సాధన రక్షిత పుష్ప శిల్పవల్లి శ్వేత కవిత స్నేహ పరిమళ లావణ్య అపూర్వ

సాక్షి, సిటీబ్యూరో: నగర పోలీసు విభాగంలో మహిళా ఉన్నతాధికారుల సంఖ్య భారీగా పెరిగింది. హైదరాబాద్ కమిషనరేట్‌లో డీసీపీ ఆపై స్థాయిలో పోస్టుల సంఖ్య 27 ఉండగా వీటిలో ఆరు ఖాళీగా ఉన్నాయి. మిగిలిన 21 పోస్టుల్లో పది మంది ఉమెన్ ఆఫీసర్లు ఉన్నారు. దీంతో ఉన్నతాధికారుల్లో మహిళల శాతం 50కు చేరుకుంది. సంయుక్త పోలీసు కమిషనర్ (పరిపాలన విభాగం) సహా ఇప్పటికే తొమ్మిది మంది మహిళా ఉన్నతాధికారులు ఉన్నారు. తాజాగా నగర నిఘా విభాగమైన స్పెషల్ బ్రాంచ్‌కు అపూర్వ రావును నియమించడంతో బాధ్యతలు స్వీకరించారు. త్వరలోనే ఈ నియామకానికి సంబంధించి పూర్తి స్థాయి ఉత్తర్వులు వెలువడనున్నాయి.

సుదీర్ఘ కాలం పాటు లేని అవకాశం

ఏళ్ల చరిత్ర ఉన్న నగర పోలీసులో సుదీర్ఘ కాలం వరకు మహిళా ఉన్నతాధికారులకు ఆస్కారం ఉండేది కాదు. పోలీసు విభాగంలో వీరి సంఖ్య తక్కువగా ఉండటంతో పాటు ఉన్నత స్థాయిలో లేకపోవడం దీనికి ఒక కారణం. అయితే కాల క్రమంలో వీరి సంఖ్య కాస్త పెరిగినా... నగరంలో ఉన్న సున్నిత పరిస్థితులు, ఇతర కారణాల నేపథ్యంలో మహిళా అధికారులకు హైదరాబాద్‌లో పోస్టింగ్ ఇచ్చే వారు కాదు. ఇక్కడ హఠాత్తుగా తలెత్తే పరిణామాలతో పాటు మతకలహాలను అదుపు చేయడం, వేళాపాళా లేని విధులు వీరితో సాధ్యం కాదనే భావన గతంలో ఉండేది. కాలక్రమంలో చోటు చేసుకున్న పరిస్థితులు, పరిణామాల నేపథ్యంలో నగర పోలీసు విభాగంలోనూ ఒక మహిళా ఉన్నతాధికారి ఉండాలని డీజీపీ కార్యాలయంతో పాటు ప్రభుత్వం భావించింది. అయితే చాన్నాళ్ళ వరకు కేవలం నార్త్‌జోన్‌కు మాత్రమే మహిళా అధికారిని నియమిస్తూ వచ్చారు. ఆ జోన్‌కు ఉండే ప్రత్యేక పరిస్థితుల నేపథ్యంలో సిటీ పోలీసు వింగ్‌లో మహిళ ఉన్నతాధికారి పోస్టు ఇది ఒక్కటే అనే భావన కొనసాగింది.

ఉమెన్ సేఫ్టీ వింగ్ రాకతో...

ఈ కారణంగానే 2014కు పూర్వం నగరంలో పని చేసిన మహిళ ఉన్నతాధికారులు అంతా నార్త్‌జోన్ డీసీపీగా వ్యవహరించిన వారే. ఒక్క ఏఆర్ అనురాధ మాత్రం అదనపు సీపీగా వ్యవహరించారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత మహిళల భద్రతకు ప్రత్యేక చర్యలు తీసుకున్న ప్రభుత్వం ప్రత్యేకంగా ఉమెన్ సేఫ్టీ వింగ్, షీ–టీమ్స్‌కు రూపం ఇచ్చింది. దీంతో ఇందులో కచ్చితంగా మహిళ ఉన్నతాధికారులనే నియమించాల్సి వచ్చింది. ఈ పరిణామంతో నగరంలో మహిళా ఉన్నతాధికారుల సంఖ్య క్రమేణా పెరుగుతూ వచ్చింది. ప్రస్తుతం సిటీ పోలీసు విభాగంలో డీసీపీ ఆపై స్థాయిలో పది మంది మహిళలు ఉన్నారు. మరో ఆసక్తికరమైన కోణం ఏమిటంటే... తొలిసారిగా 'లోకల్స్'కు ఎక్కువ సంఖ్యలో ఉన్నతాధికారులుగా పోస్టింగ్ దక్కింది. నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్, సీసీఎస్ డీసీపీ శ్వేత, స్పెషల్ బ్రాంచ్ చీఫ్ అపూర్వ రావు, సౌత్ ఈస్ట్ డీసీపీ ఎస్.చైతన్యకుమార్, టాస్క్‌ఫోర్స్ డీసీపీ వైవీఎస్ సుధీంద్ర వీరంతా హైదరాబాద్‌లోని వివిధ ప్రాంతాలకు చెందిన వారే కావడం గమనార్హం.

సిటీ పోలీసులో మహిళా ఉన్నతాధికారులు వీరే..

- పరిమళ నూతన్– పరిపాలన విభాగం సంయుక్త సీపీ
- రక్షిత మూర్తి– సీఏఆర్ హెడ్–క్వార్టర్స్ డీసీపీ
- అపూర్వ రావు– స్పెషల్ బ్రాంచ్ డీసీపీ
- సాధన – నార్త్‌జోన్ డీసీపీ
- శ్వేత– డిటెక్టివ్ డిపార్ట్‌మెంట్ డీసీపీ
- స్నేహ మెహ్రా– సౌత్ జోన్ డీసీపీ
- శిల్పవల్లి– మధ్య మండల డీసీపీ
- కవిత– ఉమెన్ సేఫ్టీ డీసీపీ
- లావణ్య జాదవ్– ఉమెన్ సేఫ్టీ డీసీపీ
- పుష్ప– ఐటీ సెల్ డీసీపీ

దరఖాస్తు చేసుకోండి

అనంతగిరి: ప్రభుత్వ క్రీడా పాఠశాలలు(హకీంపేట్, కరీంనగర్, ఆదిలాబాద్) 2025–26 సంవత్సరానికి గాను నాలుగో తరగతి ప్రవేశానికి అర్హులైన విద్యార్థిని విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా క్రీడల శాఖ అధికారి ఎంఏ సత్తార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులను టీజీఎస్ఎస్. తెలంగాణ. జీఓవీ.ఇన్ లో తమ వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. అర్హులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఫేస్‌బుక్ ద్వారా ఎరవేసి..!

ఇన్వెస్ట్‌మెంట్ స్కామ్‌లో రూ.61 లక్షలు స్వాహా

సాక్షి, సిటీబ్యూరో: నగరానికి చెందిన ఓ వ్యాపారికి ఫేస్‌బుక్ ద్వారా ఎర వేసిన సైబర్ నేరగాళ్లు ఇన్వెస్ట్‌మెంట్ పేరుతో రూ.61 లక్షలు కాజేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసుకుని సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. సికింద్రాబాద్ ప్రాంతంలో నివసించే వ్యాపారికి (40) ఇటీవల వాట్సాప్ ద్వారా ఓ సందేశం వచ్చింది. జీ–6 నువామా వెల్త్ గ్రూప్ పేరుతో ఉన్న ఆ సందేశంలోని లింకు ద్వారా ఆయన ఫేస్‌బుక్ పేజ్‌లోకి ప్రవేశించారు. అందులో తమ తమ యాప్ ద్వారా పెట్టుబడులు పెడితే భారీ లాభాలు ఉంటాయనే ప్రకటన కనిపించింది. ఆ ప్రకటనలో ఉన్నట్లు వ్యాపారి తన ఫోన్ నెంబర్‌ను అక్కడ పొందుపరిచారు. వాట్సాప్ ద్వారా సంప్రదించిన నేరగాళ్లు ఓ లింకు పంపించారు. దీని ద్వారా వ్యాపారి నువామా వెల్త్ మేనేజ్‌మెంట్ అనే ఆన్‌లైన్ ట్రేడింగ్ ప్లాట్‌ఫామ్‌లో చేరారు. అక్కడ తన పేరుతో వర్చువల్ ఖాతా తెరిచి ట్రేడింగ్, ఇన్వెస్ట్‌మెంట్స్ మొదలుపెట్టారు. ఇలా కొన్ని లావాదేవీల తర్వాత ఆయన వర్చువల్ ఖాతాలో లాభాలతో కలిపి రూ.2.99 కోట్లు బ్యాలెన్స్ చూపించారు. దీని నుంచి తాను పెట్టుబడిగా పెట్టిన రూ.56 లక్షలు విత్‌డ్రా చేసుకోవాలని బాధితుడు భావించాడు. అలా చేయాలంటే 20 శాతం కమీషన్‌గా తమకు చెల్లించాలంటూ షరతు పెట్టారు. అలా మరికొంత మొత్తం స్వాహా చేసి బాధితుడిని మోసం చేశారు. ఇలా రూ.61,52,700 నష్టపోయిన బాధితుడు మంగళవారం సిటీ సైబర్ క్రైమ్ ఠాణాను ఆశ్రయించి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది.

భూదాన్ బోర్డు భూ సమస్యలపై అర్జీలు

ఇబ్రహీంపట్నం: భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు ఎంతగానో ఉపయోగపడతాయని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్‌గౌడ్ కోరారు. ఇబ్రహీంపట్నం భాగాయత్, ఇస్మాయిల్ పంపు, తట్టిఖానా, అల్లిమియాకుంట రెవెన్యూ భూ సమస్యలపై మంగళవారం స్థానిక ఓసీ కమ్యూనిటీ హాల్‌లో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. సర్వే నంబర్ 58, సైదాబాద్ కంచె, భాగాయత్, తట్టిఖాన రెవెన్యూ పరిధి భూదాన భూములకు సంబంధించి అధికంగా దరఖాస్తులు వచ్చాయని అధికారులు తెలిపారు. ఆ భూములకు పట్టాదారు పాసు పుస్తకాలు ఇవ్వాలని పలువురు విన్నవించినట్లు పేర్కొన్నారు. భాగాయత్ పరిధి 120, తట్టిఖానా పరిధి 10, అల్లిమియా కుంట పరిధి నుంచి ఒక్క దరఖాస్తు అందిందని వివరించారు.



అర్జీలు స్వీకరిస్తున్న డీటీ శ్రీనివాస్‌గౌడ్

సర్కారు బడుల్లో నాణ్యమైన విద్య

ఇబ్రహీంపట్నం: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందని, మీ పిల్లలను వాటిల్లో చేర్పించాలని ఇబ్రహీంపట్నం బాలికల ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు కోరారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఇంటింటికి వెళ్లారు. బడీడు పిల్లలను బడిలో చేర్పించాలని, మధ్యలో బడి మానేసిన విద్యార్థులను తిరిగి చేర్పాలని సూచించారు. ఉచిత ప్రవేశం, పాఠ్యపుస్తకాలు, యూనిఫాం, మధ్యాహ్న భోజనం, శిక్షణ పొందిన ఉపాధ్యాయులతో విద్యాబోధన జరుగుతుందని వివరించారు.



బడిబాట కార్యక్రమంలో ఉపాధ్యాయులు

డీసీఎం బోల్తా, వ్యక్తికి గాయాలు

కడ్తాల్: కోళ్లను తరలిస్తున్న డీసీఎం వాహనం బోల్తాపడింది. ఈ సంఘటనలో ఓ వ్యక్తి గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కోళ్లను సరఫరా చేసే డీసీఎం వాహనం మంగళవారం ఉదయం తలకొండపల్లి నుంచి కడ్తాల్‌కు బయలుదేరగా, మార్గమధ్యలో మక్తమాధారం గేట్ సమీపంలో డ్రైవర్ అజాగ్రత్తతో కరెంట్ పోల్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వాహనంలోని కార్మికుడు రోషన్ కాళ్లకు గాయాలయ్యాయి. వాహన యాజమాని చెదురుపల్లి నర్సింహ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ వరప్రసాద్ తెలిపారు.



ప్రమాద స్థలంలో డీసీఎం

కిరాణా దుకాణాల్లో రేషన్ బియ్యం పట్టివేత

శంకర్‌పల్లి: కిరాణా దుకాణాల్లో నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సీఐ శ్రీనివాస్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని పలు కిరాణ దుకాణాల్లో అక్రమంగా రేషన్ బియ్యాన్ని నిల్వ ఉంచి అమ్ముతున్నట్లు పోలీసులకు పక్కా సమాచారం అందింది. దీంతో మంగవారం పలు దుకాణాల్లో దాడులు నిర్వహించారు. కోటికే ధనుంజయ్ దుకాణంలో నాలుగు క్వింటాళ్లు, అలంపల్లి శ్రీధర్ దుకాణంలో 3.5 క్వింటాళ్ల రేషన్ బియ్యం దొరికాయి. వాటిని స్వాధీనం చేసుకొని దుకాణ యాజమానులపై కేసులు నమోదు చేశారు. పట్టుబడిన బియ్యాన్ని సివిల్ సప్‌లై అధికారులకు అప్పగించారు.

రైలు కింద పడి వ్యక్తి మృతి

అనంతగిరి: రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన వికారాబాద్ రైల్వే పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మంగళవారం సాయంత్రం వికారాబాద్ – గోధుమగూడ రైల్వేస్టేషన్ల మధ్య ఓ వ్యక్తి మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు రైల్వే అధికారులు సమాచారం అందించారు. వెంటనే ఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతుడి వయస్సు 35 నుంచి 40 సంవత్సరాలు ఉంటుందని, చామన చాయ, బక్క పలుచని శరీరం కలిగి ఉన్నాడు. మృతుని ఒంటిపై తెలుపు నలుపు బూడిద రంగు డబ్బాల ఫుల్ షర్ట్, తెలుపు రంగు ప్యాంట్, నలుపు, ఎరుపు రంగు మొలతాడు ధరించి ఉన్నాడన్నారు. మృతదేహాన్ని వికారాబాద్ ప్రభుత్వ ఆస్పత్రి మార్చురిలో భద్రపరిచనట్లు రైల్వే హెడ్ కానిస్టేబుల్ హరిప్రసాద్ తెలిపారు. ఎవరైన ఆచూకీ తెలిసిన వారు ఉంటే వెంటనే సంప్రదించాలన్నారు.

ఇంట్లో బోర్ కొడుతోంది.. ఉండలేకపోతున్నా..!

ఫిలింనగర్‌లో యువతి అదృశ్యం

ఫిలింనగర్: తల్లిదండ్రులిద్దరూ పనులకు వెళ్లిన తర్వాత ఇంట్లో ఒక్కదానికే బోర్ కొడుతోంది.. ఉండలేకపోతున్నా అని తరచూ స్నేహితురాలికి చెబుతూ బాధపడుతున్న ఓ యువతి అదృశ్యమైంది.ఈ ఘటన ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఫిలింనగర్‌లోని మహాత్మాగాంధీ నగర్ బస్తీలో నివసించే చంద్రయ్య, రేఖ దంపతులకు వసంత (19) అనే కూతురు ఉంది. ఏడో తరగతి చదువుకున్న వసంత తల్లిదండ్రులిద్దరూ పనులకు వెళ్తుండడంతో ఇంట్లో ఒంటరిగా ఉంటోంది. ఇంట్లో బోర్ కొడుతుందంటూ ఎప్పుడూ స్నేహితురాలితో బాధపడేది. ఈ నేపథ్యంలోనే తాను బయటకు పని మీద వెళ్తున్నానని చెబుతూ తన చిన్నమ్మకు చెప్పి వెళ్లిపోయింది. ఇంటికి వచ్చి చూసిన తల్లిదండ్రులకు కూతురు కనిపించకపోయేసరికి అన్ని ప్రాంతాలు గాలించారు. ఆచూకీ దొరకకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇదిలా ఉండగా చంద్రయ్య అన్న కొడుకు విజయ్‌తో తమకు కొంతకాలంగా గొడవలు ఉన్నాయని, తమ కూతురు అదృశ్యం వెనుక విజయ్ హస్తం ఉండి ఉంటుందేమోనని అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిలింనగర్ పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని గాలింపు చేపట్టారు. ఆచూకీ తెలిసిన వారు 8712569163 నెంబర్‌లో సంప్రదించాలిన పోలీసులు కోరారు.



వసంత (ఫైల్)

బెడ్ పద్ధతి మేలు

- చెరుకు సాగులో నూతన ఒరవడికి శ్రీకారం
- తగ్గనున్న పంట పెట్టుబడులు
- ఆసక్తి చూపుతున్న రైతులు

మోమిన్‌పేట: చెరుకు సాగులో నూతన ఒరవడికి రైతులు నాంది పలుకుతున్నారు. సంప్రదాయ సాగుకు స్వస్తి పలుకుతూ తక్కువ విత్తన మోతాదుకు శ్రీకారం చుడుతున్నారు. రోజు రోజుకు పెరుగుతున్న పెట్టుబడులు, కూలీల ఖర్చులను తగ్గించుకుంటూ ఎక్కువ దిగుబడులను సాధించేందుకు కృషి చేస్తున్నారు. ఒకప్పుడు బోజ పద్ధతిలో చెరుకు సాగును చేపట్టారు. ప్రస్తుతం ఎక్కువగా బెడ్ పద్ధతిని అవలంబిస్తూ కూలీల ఖర్చును తగ్గిస్తున్నారు. పంటలో కలుపు తగ్గించేందుకు బెడ్ పద్ధతి ఎంతో ఉపయోగకరమని రైతులు పేర్కొంటున్నారు. చిన్న ట్రాక్టరుల ద్వారా బెడ్ మధ్యలో నాగలి, గుంటుక, రోటోవేటరును వేసుకొని గడ్డి జాతి మొక్కలను నివారించుకోవచ్చు. దీంతో పాటు విత్తనం ఖర్చును తగ్గించుకొనేందుకు నర్సరీలో పెంచుతున్న చెరుకు మొక్కలను వినియోగిస్తున్నారు.

నర్సరీ నుంచి మొక్కలు

నర్సరీలో పెంచిన ఒక్కో మొక్కకు రకాన్ని బట్టి రూ.2.50 నుంచి రూ.3.50 వరకు ఉంటుంది. బెడ్ పద్ధతిలో మొక్కలను నాటుకోవడంతో విత్తన మోతాదు తగ్గుతుంది. చెరుకు గడలోని విత్తనం వచ్చే ఒక ఇంచును కట్ చేసి నర్సరీలో సేంద్రియ ఎరువుల సహాయంతో ప్లాంటుపై పెంచుతారు. ఒక ఫీట్ పెరిగిన చెరుకు విత్తనాన్ని తీసుకువచ్చి నేరుగా పొలంలో నాటుతారు. దీంతో చాలావరకు కూలీల ఖర్చు తగ్గుతుందన్నారు. చెక్కర ఫ్యాక్టరీ యాజమాన్యం కొన్ని రకాలను హైబ్రిడ్ వంగడాలను అన్నదాతలకు ఇస్తుంది. దీన్ని తీసుకువెళ్లి నర్సరీలో పెంచుతున్నారు. ఒకప్పుడు చెరుకు గడలను రెండు ఫీట్ల పొడవుతో భూమిలో తొక్కేవారు. వీటన్నింటికి విత్తన ఖర్చు ఎక్కువ కావడం .. రైతులకు దిగుబడులు రాకపోవడంతో నష్టాలు చవి చూసేవారు. మండల పరిధిలోని ఏన్కతల గ్రామంలో హైదరాబాద్‌కు చెందిన శ్రీనివాస్ అనే రైతు పొలాలను కౌలుకు తీసుకొని చెరుకు సాగును చేపట్టారు. నర్సరీలో పెంచిన విత్తనాలను పొలంలో నాటుతున్నారు.



మోమిన్‌పేటలోని ఏన్కతలలో నాటిన చెరుకు